సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం ׀ 17 ׀ అక్టోబర్ ׀ 2025



ఈశాన్య రుతుపవనాల ప్రవేశం

ఈశాన్య రుతుపవనాలు గురువారం జిల్లాలోకి ప్రవేశించాయి. దీంతో తొలిరోజే పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. రబీ సాగుకు రైతన్న సన్నద్ధమయ్యాడు. IIలో



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
33.8°/20.6°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సత్యసాయి శత జయంతి వేడుకలకు రాష్ట్రపతికి ఆహ్వానం



రాష్ట్రపతి ముర్మును ఆహ్వానిస్తున్న రత్నాకర్

ప్రశాంతి నిలయం: త్వరలో జరగనున్న సత్య సాయి బాబా శత జయంతి వేడుకలలో పాల్గొనాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆహ్వానించింది. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్మును ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు కలసి ఆహ్వానించారు. ట్రస్ట్ అందిస్తున్న విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక సేవల గురించి రాష్ట్రపతికి వివరించారు. ఒడిశాలో సత్యసాయి సేవా సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రపతి సుముఖత వ్యక్తం చేసినట్లు ట్రస్ట్ వర్గాలు తెలిపాయి. కాగా.. రాష్ట్రపతిని ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ చైర్మన్ మల్లికా శ్రీనివాస్ కూడా కలిశారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంతకల్లు జంక్షన్ మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్–తిరుపతి మధ్య (07498) ఈ నెల 18వ తేదీ మాత్రమే రైలు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రైలు బేగంపేట, వికారాబాద్, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రేణిగుంట మీదుగా తిరుపతి చేరుతుందన్నారు. ధర్మవరం–షోలాపూర్ (01438) ఈ నెల 18న శనివారం మాత్రమే ధర్మవరం జంక్షన్ నుంచి బయలుదేరుతుందన్నారు. కదిరి, పీలేరు, పాకాల, తిరుపతి, రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుంతకల్లు, ఆదోని, వికారాబాద్, బీదర్ మీదుగా షోలాపూర్ చేరుతుందన్నారు.

తీరని యూరియా కష్టాలు



రొద్దంలో యూరియా కోసం ఉదయం నుంచి క్యూలో ఉన్న రైతులు

రొద్దం: రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. కూటమి సర్కార్‌కు సరైన ప్రణాళిక లేకపోవడంతో రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఉదయమే మండల కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. గంటల తరబడి వేచి చూస్తున్నా కావాల్సినంత యూరియా దొరకని పరిస్థితి నెలకొంది. గురువారం రొద్దం పీఏసీఎస్ వద్ద యూరియా పంపిణీ ఉంటుందని తెలుసుకున్న వివిధ గ్రామాల రైతులు తెల్లవారుజాము 5 గంటలకే అక్కడికి చేరుకుని క్యూ కట్టారు. అయితే 560 బస్తాల యూరియా మాత్రమే సరఫరా కావడంతో అధికారులు ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున 180 మందికి పంపిణీ చేశారు. మిగిలిన వారంతా మధ్యాహ్నం తర్వాత ఉసూరుమంటూ వెనుదిరిగారు.

- జిల్లాలో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు
- మారుమూల ప్రాంతాల్లోనూ లభిస్తున్న సరుకు
- పెన్నులు, చాక్లెట్ల రూపంలో అమ్మకాలు
- నిత్యం మత్తులో తూగుతున్న యువత
- ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో అఘాయిత్యాలు
- గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన వారిలో యువకులే అధికం

పుట్టపర్తి శివారు ప్రాంతాల్లో చీకటి పడగానే యువత ఓ చోటకు చేరుతున్నారు. గంజాయిని గుప్పుగుప్పుమంటూ పీలుస్తూ మత్తులో తూలిపోతున్నారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతంతో పాటు సాయినగర్‌లో విచ్చలవిడిగా గంజాయి వినియోగిస్తున్నట్లు తెలిసింది. చిత్రావతి రోడ్డులోని చాలామంది యువత గంజాయికి బానిసలైనట్లు సమాచారం. ఇక హిందూపురం, కదిరి, ధర్మవరం తదితర ప్రాంతాల్లోనూ గంజాయి మత్తుకు చాలామంది బానిసలయ్యారు.



యువత గం'జాయ్'

సాక్షి, పుట్టపర్తి

జిల్లా యువత 'దమ్మారో దమ్' అంటూ గంజాయి మత్తులో తూలుతోంది. ఇన్నాళ్లూ పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన గంజాయి.. ఇప్పుడు పల్లెలకూ పాకింది. దీంతో గంజాయి విక్రయిస్తున్న.. వినియోగిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. గుడి, బడి తేడా లేకుండా అన్ని చోట్ల గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి..

గంజాయి ఎక్కువగా ఒరిసా, కర్ణాటక నుంచి జిల్లాకు సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గంజాయి.. తొలుత పెనుకొండ చేరుకుంటుంది. అక్కడక్కడా నిల్వ చేసి చాక్లెట్లు, పెన్నుల్లో నింపి విక్రయిస్తున్నారు. చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి గుట్టు చప్పుడు కాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు.



గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని ఈ ఏడాది ఆగస్టు 22న అదుపులోకి తీసుకున్న కదిరి పోలీసులు (10 కిలోల గంజాయి, మూడు బైక్‌ల స్వాధీనం)

దీంతో కొనేవారు కూడా రూ.100 చెల్లిస్తే రోజుకు కావాల్సినంత మత్తు వచ్చే గంజాయి లభిస్తోంది. అధికారాన్ని అడ్డు పెట్టుకుని బడాబాబుల అండదండలతో కొందరు గంజాయి అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఎక్కడపడితే అక్కడ గంజాయి దొరుకుతుండటంతో యువత, విద్యార్థులు మత్తుకు అలవాటు పడుతున్నట్లు తెలుస్తోంది.

మత్తులో నేరాలకు పాల్పడుతూ..

గంజాయి అలవాటు పడిన వారు రోజూ సాయంత్రం కాగానే సరుకు గురించి ఆరా తీస్తున్నారు. వాట్సాప్ గ్రూప్‌ల సమాచారం ఆధారంగా గంజాయి దొరికే ప్రాంతానికి వెళ్లి మత్తులో మునిగిపోతున్నారు. అయితే గంజాయి విక్రేతలు రోజుకో ప్రాంతాన్ని ఎంపిక చేయడం... అంతదూరం వెళ్లి గంజాయి తాగిన వారు తిరిగి వచ్చే సమయంలో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. కొందరైతే హత్యలకూ వెనుకాడటం లేదు. ఇటీవల పుట్టపర్తి మున్సిపాలిటీ బ్రాహ్మణపల్లిలో ఓ హత్య కేసులోని నిందితులు ఘటన సమయంలో గంజాయి మత్తులో ఉన్నట్లు తెలిసింది. ఇక చిత్రావతి రోడ్డులో ఓ విదేశీయుడు గంజాయి మత్తులో భవనం పైనుంచి పడి చనిపోయిన ఘటన నెల క్రితం వెలుగు చూసింది. ఇక గతేడాది విజయదశమి రోజున చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి వద్ద అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం చేసిన వారందరూ గంజాయి మత్తులో ఉన్నట్లు తెలిసింది. వారిపై గతంలోనూ గంజాయి కేసులున్నాయి.

వదిలిపెట్టే ప్రసక్తే లేదు



గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. గంజాయి విక్రేతలు ఎవరైనా వదిలే ప్రసక్తే లేదు. యువత కూడా మత్తుకు దూరంగా ఉండాలి. భవిష్యత్తుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి. గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయండి. దాడులు చేసి నిందితులను పట్టుకుంటాం. – సతీశ్‌కుమార్, ఎస్పీ

కలంపై జులుమా?



అనంతపురం: ప్రజల తరపున పోరాడుతున్న 'సాక్షి' గొంతుక నొక్కడానికి కూటమి ప్రభుత్వం మరోసారి పోలీసులను ప్రయోగించింది. ప్రధాన సంచికలో ప్రచురితమైన వార్తకు సంబంధించి దాఖలైన రెండు అక్రమ కేసుల్లో 'సాక్షి' ఎడిటర్ ఆర్. ధనంజయ రెడ్డికి కేవలం మూడు రోజుల వ్యవధిలోనే మూడు సార్లు పోలీసులతో నోటీసులు జారీ చేయించింది. రాష్ట్ర పోలీసులు ఏకంగా హైదరాబాద్‌లోని 'సాక్షి' కార్యాలయానికి వెళ్లి చేసిన హడావుడి, జర్నలిస్టుల గొంతు నొక్కేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికమని జర్నలిస్టులు, మేధావులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించడమే



సాక్షి పత్రిక ఎడిటర్‌పై కక్ష గట్టి పోలీసుల సాయంతో వరుసగా కేసులు నమోదు చేయడం ఆక్షేపణీయం. పత్రికల్లో వార్త ప్రచురిస్తే.. ఆ వార్తకు సంబంధించి 'న్యూస్ సోర్స్'ను వెల్లడించాలని పోలీసులు బలవంతం చేయలేరు. వరుసగా కేసులు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుంది. – శంకరయ్య, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ ఫోరం

దుర్మార్గమైన చర్య



కూటమి పాలనలో పత్రికలకు గాని, ప్రజలకు గాని అన్యాయాలపై మాట్లాడే అవకాశం ఉండదు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విభాగాల్లో ప్రజల సొమ్ము దోచేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రశ్నించే పత్రికలపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య.
– తలారి రామాంజనేయులు, సీనియర్ జర్నలిస్ట్



క్లుప్తంగా

‘ఓపెనింగ్’ అదిరింది


- సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు శుభారంభం
- అర్ధసెంచరీలతో రాణించిన తేజ, శ్రావణ్
- ఆటముగిసే సమయానికి ఆంధ్ర 210/2



తలపడిన ఆంధ్ర, ఢిల్లీ జట్లు

అనంతపురం కార్పొరేషన్: బీసీసీఐ ఆధ్వర్యంలో అనంతపురం స్పోర్ట్స్ సెంటర్‌లోని ప్రధాన క్రీడామైదానం వేదికగా గురువారం ప్రారంభమైన సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు శుభారంభం చేసింది. తొలి రోజు ఆటముగిసే సమయానికి ఢిల్లీ జట్టుపై 74.2 ఓవర్ల వద్ద రెండు వికెట్లు కోల్పోయి 210 పరుగులతో పటిష్ట స్థాయికి చేరుకుంది. వర్షం కారణంగా 15 ఓవర్లు మిగిలి ఉండగానే ఆట ముగిసింది. బీసీసీఐ నూతన నిబంధనల మేరకు టాస్ లేకుండానే అతిథి జట్టుకు బ్యాటింగ్, ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతో ఢిల్లీ జట్టు మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి భీమలింగారెడ్డి, సహాయ కార్యదర్శి జి.మురళీకృష్ణ, ఏసీఎల్‌ఓ శర్మాస్‌వలి, తదితరులు పర్యవేక్షించారు. బ్యాటింగ్ బరిలో దిగిన ఆంధ్ర జట్టు ఓపెనర్ సాయిశ్రావణ్ నిలకడగా ఆడుతూ 160 బంతుల్లో 9 బౌండరీలతో 73 పరుగులు చేశాడు. మిడిల్ ఆర్డర్‌గా వచ్చిన మరో బ్యాటర్ జీఎస్‌పీ తేజ 165 బంతుల్లో 8 బౌండరీలతో 73 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఢిల్లీ బౌలర్లలో దేవ్‌లక్రా 47 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీసుకోగా, భరద్వాజ్ 49 పరుగులు ఇచ్చి ఒక వికెట్ కూలదోశాడు.

ఈశాన్య రుతుపవనాల ప్రవేశం



అనంతపురం అగ్రికల్చర్: ఈశాన్య రుతుపవనాలు గురువారం జిల్లాలోకి ప్రవేశించాయి. డిసెంబర్ ఆఖరు వరకు ఈశాన్యంతో వర్షాలు పడాలి. అందులో అక్టోబర్‌లో అత్యధికంగా 100.9 మి.మీ కాగా చలికాలం ప్రారంభమయ్యే నవంబర్‌లో 28.6 మి.మీ, డిసెంబర్‌లో 9.8 మి.మీ... వెరసి రబీ సాధారణ వర్షపాతం 139.3 మి.మీ గా గుర్తించారు. సాధారణంగా నవంబర్, డిసెంబర్‌లో అల్పపీడనాలు, తుఫాన్ల ప్రభావం ఉంటుంది. కాగా ప్రస్తుత అక్టోబర్‌లో ఇప్పటి వరకు పెద్దగా వర్షపాతం నమోదు కాలేదు. 16 రోజులవుతున్నా కేవలం 22.7 మి.మీ నమోదైంది. గురువారం ఈశాన్యం ప్రవేశంతో అనంతపురం, బుక్కరాయసముద్రం, యల్లనూరు, పుట్లూరు, తాడిపత్రి, శింగనమలతో పాటు అక్కడక్కడ మోస్తరుగా వర్షాలు పడటంతో రబీ ఏరువాక ఊపందుకునే పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఈ రబీలో 1.08 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేశారు. అందులో ప్రధానపంట కింద పప్పుశెనగ 65 వేల నుంచి 70 వేల హెక్టార్లుగా అంచనా వేశారు. ఖరీఫ్‌తో పోల్చుకుంటే రబీ సాగు తక్కువగానే ఉంటుంది. ప్రధానంగా నల్లరేగడి ప్రాంతాల్లో పప్పుశనగ, ఇక నీటి వసతి కింద వరి, వేరుశనగ, మొక్కజొన్న కొంత వరకు సాగులోకి రావచ్చని చెబుతున్నారు.

ఆదాయం ఎర.. దోపిడీ పరంపర


- ముదురుతున్న చైన్‌లింక్ వ్యవహారం
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఫేక్ కంపెనీలు
- రూ.లక్షలు పోగొట్టుకుంటున్న ప్రజలు



చిలమత్తూరు: ముచ్చటైన ఆఫర్లు.. కళ్లెదుటే లాభాలు.. చుట్టపక్కల వాళ్లను జత చేస్తే బోనస్‌లు.. బ్యాంక్ ఖాతాలోకి తెరతెరలుగా వచ్చి పడుతున్న డబ్బును చూసి అందరికీ ఆశ కలిగింది. ఒకరిని చూసి మరొకరుగా చేరుతుండడంతో కంపెనీకి విస్తృత ప్రచారం లభించింది. కొత్త ఖాతాలు పెరగడంతో పాటు వ్యాపారమూ ఊపందుకుంది. అంతా సజావుగా సాగిపోతోందనుకుంటుండగానే రాత్రికి రాత్రి మాయమైంది. ఇది జిల్లాలో సరికొత్తగా వెలుగు చూసిన ఆన్‌లైన్ మోసం. ఈ చైన్ లింక్ వ్యవహారాన్ని నమ్మి పెట్టుబడి పెట్టిన వారు రూ.లక్షల్లో నగదు పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు.

ఈజీ మనీ కదా అనుకుంటే..

ఆదాయాన్ని ఎరగా చూపి దోపిడీ చేసే యాప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన యాప్‌ల ఉచ్చులో మహిళలే ఎక్కువగా చిక్కుకుంటున్నారు. తొలుత డబ్బు తమ ఖాతాలకు జమ అవుతుంటే సంతోషపడిన మనసులు, ఆఖరుకు మోసపోయామని తెలుసుకుని లబోదిబో మంటున్నాయి. తెలివైన వాళ్లు ఆదిలోనే ఆదాయం రాగానే ఆపేస్తుండగా, తాజాగా జిల్లాలో చాలా మంది ఈజీ మనీ కదా అని ఎల్‌జీ డిజిటల్ మీడియా యాప్ ఉచ్చులో చిక్కుకుని రూ. లక్షల్లో డబ్బు పోగొట్టుకున్నారు. రూ. వందల్లో పెట్టుబడి పెట్టి ప్రచార వీడియోలు చూస్తే రూ.వేలల్లో బ్యాంక్ ఖాతాలకు నగదు జమ అవుతుందని వాట్సాప్ నంబర్‌కు విదేశీ నంబర్ నుంచి వచ్చిన మెసేజ్‌ను చూసి చాలా మంది బోల్తాపడ్డారు. ముందుగా వారు చెప్పినట్లుగానే వెబ్‌సైట్ నుంచి యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత కొంత మొత్తాన్ని తొలుత పెట్టుబడి పెట్టారు. ఆ తర్వాత కొంత మొత్తం వాలెట్‌లో కనిపించింది. ఈ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కూడా ఉండడంతో చాలా మంది ఎంతో బాగుందని అనుకున్నారు. ఇదే విషయాన్ని తమకు తెలిసిన వారికి చెప్పి వారిని కూడా ఉచ్చులోకి లాగేశారు. చైన్‌లింక్‌లో సభ్యులను చేర్పిస్తే బోనస్‌లు, ఇన్సెంటివ్‌లు అంటూ ఊరించారు. ఇలా ఒకరి తర్వాత ఒకరుగా చేరుతూ వచ్చారు. ఎందుకు నగదు జమచేస్తున్నామో తెలియకుండానే పెట్టుబడి పెడుతూ వెళ్లారు. చివరకు సైట్ మూసేయడంతో తాము మోసపోయినట్లుగా తెలుసుకుని ప్రస్తుతం లబోదిబో మంటున్నారు.



విదేశీ నంబర్లతో గ్రూప్ నిర్వహిస్తున్న దృశ్యం



విదేశీ నంబరుతో అందిన మెసేజ్

అప్రమత్తంగా ఉండాలి

ఫేక్ కంపెనీలు ఇచ్చే ప్రకటనలను చూసి విద్యావంతులు సైతం మోసపోతున్నారు. ఇది దురదృష్టకరమన్నారు. పనికి తగ్గ వేతనం ఉంటుంది. అయితే పనీపాట లేకుండా ప్రకటన వీడియోలు చూస్తూ డబ్బు సంపాదించాలనుకోవడం అత్యాశే అవుతుంది. ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలి. మోసపోతున్నట్లుగా తెలుసుకుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. – జనార్దన్, సీఐ, హిందూపురం రూరల్ సర్కిల్

ఉచిత వైద్యాన్ని దూరం చేసే కుట్ర





రెడ్డిపల్లిలో నాయకులు, కార్యకర్తలతో కలసి కోటి సంతకాల సేకరణ పోస్టర్లు ప్రదర్శిస్తున్న శ్రీధర్‌రెడ్డి, వేళ్లమద్దిలో శ్రీధర్‌రెడ్డి సమక్షంలో సంతకాలు చేస్తున్న మహిళలు

- కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి

నల్లమాడ: మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆస్పత్రులను ప్రైవేట్‌పరం చేయడం ద్వారా పేదలకు ఉచిత వైద్యాన్ని దూరం చేసే కుట్రకు కూటమి ప్రభుత్వం తెరతీసిందని వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి ధ్వజమెత్తారు. నల్లమాడ మండలం చారుపల్లిలో గురువారం ఆయన రచ్చబండ కార్యక్రమం ద్వారా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం యర్రవంకపల్లి, రెడ్డిపల్లి, వేళ్లమద్ది, కొండకింద తండా, పాతబత్తలపల్లి పంచాయతీలోని నల్లసింగయ్యగారిపల్లిలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో శ్రీధరరెడ్డి మాట్లాడారు. పేదలకు మెరుగైన ఉచిత వైద్యం అందించాలన్న సంకల్పంతో దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొస్తే, ఆ పథకాన్ని మరింత విస్తృతం చేసి ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బిల్లులు చెల్లించకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలోనూ కల్తీ మద్యం ఏరులై పారుతోందన్నారు. ఏడాదిన్నర పాలనలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనపెట్టి ధనార్జనే ధ్యేయంగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ హయాంలో గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందించామన్నారు. మళ్లీ ఆ సువర్ణ పాలనను తీసుకొచ్చేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని, కోటి సంతకాల కార్యక్రమం ద్వారా చంద్రబాబు వైఫల్యాలను నిలదీద్దామంటూ పిలుపునిచ్చారు. కాగా, శ్రీధరరెడ్డి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆయా గ్రామాల్లో విశేష స్పందన లభించింది. నాయకులు, కార్యకర్తలే కాకుండా వృద్ధులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో సంతకాలు చేయడానికి ఆసక్తి చూపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పారకల రమణ, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బీఆర్ కేశప్ప, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, మాజీ ఎంపీపీ జయరామిరెడ్డి, వైస్ ఎంపీపీ కె.సూర్యనారాయణ, సర్పంచ్‌లు ప్రమీలమ్మ, రజనీకాంత్‌రెడ్డి, ప్రసాద్, బొజ్జేనాయక్, ప్రమీలబాయి, మాసే రెడ్డెమ్మ, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు జయమ్మ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాజేంద్రనాయక్, చారుపల్లి పంచాయతీ పరిశీలకులు గోవిందరెడ్డి, మాజీ డీలర్లు మధుసూదన్‌రెడ్డి, యర్ర సూరి, నాయకులు కాళసముద్రం జయరామిరెడ్డి, పుల్లారెడ్డి, రామలింగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎంసీ బయపరెడ్డి, రమణారెడ్డి, సీతారాం, వేళ్లమద్ది హరి, మంగేనాయక్, చంద్రశేఖర్, షరీఫ్, చిన్నా, సుధాకర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

‘తమ్ముడా మజాకా’పై కలెక్టర్ సీరియస్

- విచారణకు ఆదేశం
- నోటీసు జారీ చేస్తామన్న ఎంపీడీఓ

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు రూరల్: టీడీపీ అనుబంధ టీఎన్‌టీయూసీ హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు తాడాల నాగభూషణం మానసిక వికలాంగ కోటాలో అక్రమంగా పింఛన్ పొందుతున్న వైనంపై ‘తమ్ముడా మజాకా’ శీర్షికన గురువారం ‘సాక్షి’లో వెలువడిన కథనంపై అనంతపురం కలెక్టర్ ఓ.ఆనంద్ స్పందించారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో నివాసముంటున్న తాడాల నాగభూషణం పదేళ్లుగా ఈ పింఛన్ పొందుతున్నాడు. ఇప్పటి వరకూ పింఛన్లు పొందుతున్న వందశాతం వైకల్యం ఉన్న వేలాదిమంది దివ్యాంగులకు ఇటీవల నోటీసులు జారీ చేసిన కూటమి ప్రభుత్వం ... టీడీపీ నాయకుడు నాగభూషణంకు ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం గమనార్హం. ఈ విషయాన్ని ‘సాక్షి’ వెలుగులోకి తెవడంతో గుర్తించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో ఎంపీడీఓ దివాకర్ మాట్లాడుతూ విచారణలో భాగంగా నోటీసు జారీ చేస్తామని పేర్కొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

- కలెక్టర్ శ్యాంప్రసాద్



ధనియానిచెరువు గ్రామంలో పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

ఎన్పీకుంట: సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు కలెక్టర్ శ్యాంప్రసాద్ సూచించారు. గురువారం ధనియానిచెరువు గ్రామంలో రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటలను వ్యవసాయాధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. సేంద్రియ వ్యవసాయ ప్రాముఖ్యత, ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారాన్ని కాపాడుకునే విధానాలను వివరించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ నమోదు చేసిన ఈ క్రాప్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ధనియానిచెరువు పంచాయతీ పరిధిలో గుర్తించిన ప్రభుత్వ భూములను ఎన్‌టీపీసీ, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. పట్టా కలిగిన భూములకు లీజు ప్రాతిపదికన ఎకరాకు రూ.30వేలు చొప్పున చెల్లిస్తారని, రెండేళ్లకు ఒకసారి 5 శాతం చొప్పున లీజు పెంచి ఇస్తారని తెలిపారు. అంతకు ముందు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కదిరి ఆర్డీఓ వీవీఎస్ శర్మ, తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఏడీఏ సనావుల్లా, ఎంఏఓ లోకేశ్వరరెడ్డి, ఎస్‌ఐ వలీబాషా, రెవెన్యూ అధికారులు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో రైతుకు సాయంగా నిలవండి

కదిరి అర్బన్: పంటల సాగులో రైతులకు తగిన సూచనలిస్తూ సాయంగా నిలవాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ వ్యవసాయ శాస్త్రవేత్తలకు సూచించారు. గురువారం ఆయన స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధనా స్థానంలోని పంట ప్రదర్శన క్షేత్రాలు, ప్రయోగశాలలు, విత్తన యూనిట్లను పరిశీలించారు. క్షేత్రంలో సాగు చేస్తున్న విత్తన వేరుశనగ రకాలు, దిగుబడి, సాంకేతికత, రైతులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. కదిరి పరిశోధనా స్థానంలో ఉత్పత్తయిన వేరుశనగ వంగడాలు దేశంలోని ఎంతో ఖ్యాతిగాంచాయని ప్రధాన శాస్త్రవేత్త భాస్కర్‌రెడ్డి ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వీవీఎస్ శర్మ, తహసీల్దార్ మురళీకృష్ణ, శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కర్మాగారంలో ప్రమాదం

తాడిపత్రి టౌన్: మండలంలోని అయ్యవారిపల్లి వద్ద ఉన్న సుగుణ స్పాంజ్ ఐరన్ పరిశ్రమలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రమాదం చోటు చేసుకుంది. ద్రవరూపంలో ఉన్న ఇనుము కార్మికులపై పడడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కంబగిరి రాముడు, సునీల్, జార్జ్ ఉన్నట్లుగా తెలిసింది. అయితే ఈ విషయాన్ని యాజమాన్యం గుట్టుగా ఉంచింది. క్షతగాత్రులను తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రహస్యంగా మరో నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా కార్మికులతో పని చేస్తుండటంతోనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం



నాయకులు, కార్యకర్తలతో కలసి పోస్టర్లు విడుదల చేస్తున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

తాడిమర్రి: నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలతో పాటు వైద్యవిద్యను అభ్యసించాలనుకునే వారికి మేలు చేసేలా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం దుర్మార్గమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ధర్మవరం సమన్వయకర్త కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మండిపడ్డారు. గురువారం డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం వద్ద జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన హయాంలో ఆరోగ్యశ్రీ, 108, 104 వాహనాలు ప్రవేశపెట్టి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించారని కొనియాడారు. ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేయడంతో పాటు ప్రతి పంచాయతీలో విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించారన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో కేవలం 12 మెడికల్ కళాశాలలు ఉండగా... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. తన హయాంలోనే 5 కళాశాలను పూర్తి చేశారన్నారు. మిగిలిన 12 కళాశాలలు కూడా అందుబాటులోకి వస్తే వేలాది మంది పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేవారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఆయా మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడానికి పూనుకుందన్నారు. దీనివల్ల భవిష్యత్ తరాలకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందని కేతిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.



తాడిమర్రిలో సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

అందువల్ల మేధావులు, యువత ముందుకు వచ్చి ప్రభుత్వ తీరును ఖండించాలన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టిందని, కార్యక్రమం అనంతరం ఆ పత్రాలను గవర్నర్‌కు అందిస్తామని కేతిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల పరిశీలకుడు సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు జొల్లిరెడ్డి అశ్వత్థ, బీసీ సెల్ నియోజక వర్గ అధ్యక్షుడు కుంటాల పుల్లయ్య, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు పొరాళ్ల విజయభాస్కర్‌రెడ్డి, అగిలే శంకర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు, యువజన విభాగం మండల అధ్యక్షుడు సిద్దే మోహన్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్లు మల్లప్పగారి మాధవరెడ్డి, అల్లే సాయినాథ్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షులు కొండారుపల్లి విశ్వనాథ్, సల్లాపురం బాలరమణారెడ్డి, యలక శ్రీనివాసరెడ్డి, గుజ్జల హనుమంతు, పిట్టు పరమేశ్వర్‌రెడ్డి, పాటిల్ ప్రకాష్‌రెడ్డి, హనుమంతరెడ్డి, సన్నప్పయ్య, రాజేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బాలకృష్టారెడ్డి, ఆత్మకూరు, నార్శింపల్లి సర్పంచులు కట నారాయణరెడ్డి, నారాయణస్వామి, కో ఆప్షన్ సభ్యులు బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వివాహిత మృతి

యాడికి: రైలు ఢీకొని ఓ వివాహిత మృతి చెందింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన కురుబ దస్తగిరి, మద్దిలేటమ్మ (40) దంపతులకు పదో తరగతి చదువుతున్న ఓ కుమారుడు ఉన్నాడు. మద్దిలేటమ్మ మతి స్థిమితం లేకుండా బాధపడుతోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం దస్తగిరి తోటకు వెళ్లిన సమయంలో ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న దస్తగిరమ్మ నెమ్మదిగా రైలు పట్టాలపై చేరుకుని అటూఇటు తిరుగుతుండగా రైలు ఢీకొంది. ఘటనలో శరీరం ఛిద్రమైంది. సమాచారం అందుకున్న గుత్తి రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

యువకుడి దుర్మరణం



మృతుడు రమేష్‌నాయక్

పెనుకొండ: స్థానిక జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తెలంగాణ లోని షాద్‌నగర్‌కు చెందిన సేవేనాయక్... ఐచర్ వాహన డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తన కుమారుడు రమేష్‌నాయక్ (25)తో కలసి ఐచర్ వాహనంలో సరుకు లోడు చేసుకుని బుధవారం రాత్రి బెంగళూరుకు బయలుదేరాడు. గురువారం తెల్లవారుజామున పెనుకొండ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై యోగా లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్దకు చేరుకోగానే అప్పటికే రోడ్డు పక్కన ఆపి ఉన్న లారీని వెనుక నుంచి ఐచర్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రమేష్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పెనుకొండ పీఎస్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. యువకుడి మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సేవేనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తా - బాలుడి మృతి



ఇర్షాద్ (ఫైల్)

పెనుకొండ రూరల్: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన ఓ కుటుంబం పెనుకొండ బాబయ్య దర్గా దర్శనానికి గురువారం ఆటోలో బయలుదేరింది. పెనుకొండ మండలం హరిపురం వైజంక్షన్ వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇర్షాద్ (11) అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన షబ్రీన్, వదిహా, మహబూబీను స్థానికులు వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న షబ్రీన్‌ను హిందూపురానికి వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వరుస దొంగతనాలు

పావగడ: తాలూకాలోని తిరుమణి గ్రామంలో పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో పట్టపగలే వరుస చోరీలు చోటు చేసుకున్నాయి. కిలారి వెంకటేశ్ తన కుమారుడి వివాహానికి సంబంధించి పెళ్లి పత్రికలు పంచేందుకు గురువారం కళ్యాణదుర్గం వెళ్లారు. ఇంటికి తాళం వేసి భార్య నారాయణమ్మ వ్యక్తిగత పనిపై బయటకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు ఉదయం 9 గంటల సమయంలో తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలోని 6 తులాల బంగారు నగలు, రూ.2.70 లక్షల నగదు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. అలాగే కిలార్లహళ్లి గ్రామంలో బ్యాడనూరు చంద్రశేఖర్ ఆచారీకిచెందిన రీవైండింగ్ దుకాణంలో దుండగులు చొరబడి రూ.3 లక్షల విలువైన 2 కొత్త మోటార్లు, 3 రీవైండింగ్ మోటార్లు, 5 బాక్సుల కేబుల్‌ను అపహరించారు. బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైల్వే ఉద్యోగి బలవన్మరణం

పెనుకొండ: తన విద్యార్హతలకు తగిన ఉద్యోగం రాలేదంటూ ఓ రైల్వే ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రాజస్తాన్‌కు చెందిన లోకేష్ మీనా (29) 2022లో రైల్వే గేట్‌మెన్‌గా ఎంపికై పెనుకొండలో విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే ఉన్నత చదువులు అభ్యసించిన తాను పలు ప్రయత్నాలు చేసిన అందుకు తగిన ఉద్యోగం రాలేదనే మానసిక వేదనలో ఉండేవాడు. ఈ క్రమంలోనే కొన్ని రోజులు క్రితం భార్య రాజస్తాన్‌కు వెళ్లింది. దీంతో రైల్వే క్వార్టర్స్‌లోని తన ఇంట్లో ఒంటరిగా ఉన్న లోకేష్ మీనా బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి విధులకు హాజరు కాకపోవడంతో తోటి ఉద్యోగితో పాటు ఉన్నతాధికారులు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోయింది. గురువారం ఉదయం సైతం ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చిన తోటి ఉద్యోగులు ఇంటి వద్దకు చేరుకుని కిటికీలో నుంచి చూడడంతో ఆత్మహత్య విషయం వెలుగు చూసింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని తలుపులు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కుటుంబసభ్యులు రాజస్తాన్‌లో ఉండడంతో ప్రతి అంశాన్ని పోలీసులు వీడియో తీశారు. కుటుంబసభ్యులు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామని పోలీసులు పేర్కొన్నారు.

కారు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న కారు

పెనుకొండ రూరల్: స్థానిక 44వ జాతీయ రహదారిపై ఓ కారు దగ్ధమైంది. కియా పోలీసులు తెలిపిన మేరకు.. రామగిరి మండలం పెనుబోలుకు చెందిన చంటి వ్యక్తిగత పనిపై బుధవారం రాత్రి కారులో బెంగళూరు వైపు బయలుదేరాడు. గుట్టూరు సమీపంలోకి చేరుకోగానే ముందు వెళుతున్న మరో వాహనాన్ని ఢీకొనడంతో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చంటి అప్రమత్తమై కారులో నుంచి బయటపడ్డారు. సమాచారం అందుకున్న కియా పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసే లోపు కారు పూర్తిగా కాలిపోయింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు కియా పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DMLT ADMISSIONS

■ DMLT 2 సం॥ కోర్సునకు అడ్మిషన్లు జరుగుచున్నవి. కొన్నిసీట్లు మాత్రమే కలవు. Q: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) # SEEDS కాలేజ్, కమలానగర్, అనంతపురం. సెల్: 9440255034, 8897761840. [SCA25009002]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6836]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
అద్దెకు | అమ్మకం | రియల్ ఎస్టేట్ | ఫర్నీచర్స్ | ఆటోమొబైల్ | కంప్యూటర్స్ | సర్వీసెస్ | జాబితాలు
4 లైన్లు రూ 270/-
అదనపు లైను రూ 60/-
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9494767933
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

WANTED

■ ATP టౌన్, ఫర్నిచర్ షాప్ లో పనిచేయుటకు అకౌంటెంట్ మరియు సేల్స్ బాయ్స్ అర్జెంటుగా కావలెను. సెల్: 6309624896. [A-1696]

■ AutoCad డ్రాఫ్ట్ (సివిల్) M/F కావలెను. అర్హత: ITI / డిప్లొమా సివిల్ విద్యార్థులు. సంప్ర. E.S. Engineers. సెల్: 9100302756 / 9908036742. [A-1104]

■ అనంతపురం టౌన్, గుత్తి రోడ్ లో గల JK ఎంటర్ ప్రైజస్ నందు పనిచేయుటకు Tally ఆపరేటర్-సిస్టమ్ బిల్లింగ్ ఆపరేటర్ వెంటనే కావలెను. సెల్: 8008803109. [A-1697]

■ బుక్స్ మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: MBA/డిగ్రీ అనుభవంబట్టి జీతం. సంప్ర: అనుబుక్ సెంటర్, కమలానగర్, ATP. 9440461355 [SCA25009071]

■ Work from home మా కంపెనీ అడ్వర్టైజ్మెంట్లు మీ మొబైల్ ద్వారా పార్ట్ టైం పంపుటకు స్త్రీ/పు. కావలెను. వారానికి 3,500. వివరాలకు వాట్సాప్‌లో hi అని మెసేజ్ పెట్టి కాల్ చేయండి 82478 08801 [SCA 25008982]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.